టార్గెట్ మేయర్

'డిప్యూటీ'కీ తప్పని పదవీ గండం..!


మీర్‌పేట్ కార్యాలయం

- మీర్‌పేట్ బీఆర్ఎస్‌లో లుకలుకలు
- రెండుగా చీలిన కౌన్సిల్ సభ్యులు
- తమకు అనువుగా మలచుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్

సరూర్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒకరిని టార్గెట్ చేస్తూ అవిశ్వాసానికి రంగం సిద్ధం చేస్తే.. అదికాస్తా మరొకరి మెడకు కూడా చుట్టుకుంటోంది. వాస్తవానికి మీర్‌పేట్ కార్పొరేషన్‌లో మేయర్ దుర్గాదీప్ లాల్‌పైనే అసంతృప్తి తీవ్రంగా ఉంది. ఆమె ఎన్నికైన నాటి నుంచి ఆమె భర్త దీప్‌లాల్‌చౌహాన్ కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తూ సొంత పార్టీ సభ్యులను సైతం నిర్లక్ష్యం చేసినట్టు ఆరోపణలున్నాయి. దాంతో బీఆర్ఎస్ సభ్యులు ఆమెపై, ఆమె భర్తపై జిల్లా కలెక్టర్‌కు, సీడీఎంఏకు ఫిర్యాదులు చేశారు. రెండున్నరేళ్లు కాగానే అవిశ్వాసం పెట్టాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న అప్పటి మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఇరువర్గాలను పిలిపించి సర్ది చెప్పారు. దాంతో బీఆర్ఎస్‌లోని కుంపటి తాత్కాలికంగా చల్లారింది. మరోపక్క అవిశ్వాసం పెట్టడానికి నాలుగేళ్ల గడువును నిర్ణయిస్తూ అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంతో మేయర్‌పై గుర్రుగా ఉన్న సొంత పార్టీ సభ్యులతోపాటు బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు సైతం సైలెన్స్ అయిపోయారు. ప్రస్తుతం నాలుగేళ్ల గడువు శనివారంతో ముగియనుండడంతో తాజాగా మరోమారు అవిశ్వాస అంశం తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్‌లోని సభ్యుల మధ్య ఉన్న లుకలుకలను బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు తమకు అనుకూలంగా మలచుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఆ రెండు పార్టీలకు మద్దతిస్తున్న బీఆర్ఎస్ సభ్యులు.. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని తెగేసి చెబుతున్నట్టు తెలిసింది.

చెరో పదవి రావాలంటే ఇద్దరినీ దించాల్సిందే..!

మీర్‌పేట్‌లో మేయర్ ఒక్కరిపైనే అవిశ్వాసం పెట్టాలని ముందుగా సభ్యులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. అయితే బీజేపీ, కాంగ్రెస్ కలిసి అవిశ్వాసం పెట్టి అది నెగ్గిన తర్వాత ఎవరో ఒకరు మాత్రమే మేయర్ పదవి తీసుకుంటే, ఇంకో పార్టీ పరిస్థితి ఏమిటి?.. అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దాంతో ఇరు పార్టీలకు న్యాయం జరగాలంటే డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డిని కూడా గద్దె దించాల్సిందేనని, అప్పుడే రెండు పార్టీలు చెరో పదవి అధిష్ఠించడానికి మార్గం సుగమమవుతుందనే అభిప్రాయానికి వచ్చారు. బీజేపీలోని కొందరు సభ్యులకు డిప్యూటీ మేయర్‌పై అసంతృప్తి లేకున్నా.. మేయర్‌తోపాటు ఆయనపైనా అవిశ్వాసం పెట్టక తప్పని పరిస్థితి తలెత్తుతున్నదని ఓ సభ్యుడు పేర్కొనడం గమనార్హం. డిప్యూటీ మేయర్ కూడా తమతో పాటు మేయర్‌పై అవిశ్వాసానికి ముందుకొస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఆయన పదవి సేఫ్ జోన్‌లో ఉంటుందని ఇంకొందరు సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే సొంత పార్టీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి ఆయన అంగీకరిస్తారా లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఆ పార్టీ బంతి ఎమ్మెల్యే సబితారెడ్డి కోర్టులో ఉన్నందున డిప్యూటీ మేయర్ అంతటి సాహసం చేసే సూచనలు కనిపించడంలేదని, అందుకే ఆయనపైనా తాము అవిశ్వాసం పెట్టాలనుకుంటున్నామని కొందరు సభ్యులు స్పష్టం చేశారు. దాంతో మేయర్‌ను టార్గెట్ చేస్తే దాని ప్రభావం డిప్యూటీ మేయర్‌పైనా పడ్డట్టయిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి మాత్రం ఇద్దరి పదవులు కాపాడుకోవాలనే లక్ష్యంతో పావులు కదుపుతున్నట్టు తెలిసింది. సొంత పార్టీ సభ్యులు చేజారకుండా చూసుకుని, అవసరమైతే బీజేపీలోని కొందరు సభ్యులను సైతం తమ వైపు తిప్పుకోవాలని ఆమె ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలియవచ్చింది. అయితే ఇప్పటికే దాదాపు 25 మందికి పైగా సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేసినట్టు ప్రచారం జరుగుతున్న దరిమిలా.. సంతకాలు చేసిన వారిలో ఎంతమంది వెనక్కి తగ్గుతారన్నది చర్చనీయాంశంగా మారింది. అన్నీ అనుకూలిస్తే ఈనెల 27న గానీ, 29న గానీ అవిశ్వాసానికి సంబంధించిన లేఖను జిల్లా కలెక్టర్‌కు అందజేసే సూచనలు కనిపిస్తున్నాయి. ఎవరైనా వెనక్కి తగ్గితే ఈ అంశం అటకెక్కినట్టేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

కిషన్‌రెడ్డి వద్దకు బీజేపీ పంచాయతీ

కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై బీజేపీ అధిష్ఠానం దృష్టి సారించింది. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం పార్టీ జిల్లా అధ్యక్షుడు తమ పార్టీ సభ్యులతో చర్చించి, తుది నిర్ణయాన్ని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి వదిలేసినట్టు తెలిసింది. ఆయన నుంచి అనుకూల సంకేతాలు వస్తే ఓకే.. లేదంటే అవిశ్వాసం లేనట్టేనని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. రెండ్రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్టు తెలుస్తోంది.


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జాతీయ రహదారిపై రోడ్డు రోలర్ దగ్ధం

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు రోలర్ దగ్ధమయింది. కొన్ని రోజులుగా ఇక్కడ జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు జరిగాయి. అనంతరం రోలర్ డ్రైవర్ దాన్ని అక్కడే పార్కు చేశారు. రాత్రి 7 గంటల సమయంలో రోలర్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన వాహనదారులు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రోలర్ పూర్తిగా దగ్ధమైంది. అయితే, జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరగడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఎడిఫై హైస్కూల్ సీఈవోకు రాష్ట్రపతి మెడల్


కేకేవీ రెడ్డి

సరూర్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాలాపూర్‌లోని ఎడిఫై వరల్డ్ హైస్కూల్ సీఈవో కేకేవీ రెడ్డిని రాష్ట్రపతి మెడల్ వరించింది. సీఆర్‌పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన కేకేవీ రెడ్డి, ఎడిఫై వరల్డ్ హైస్కూల్‌లో సీఈవోగా చేరారు. అంతకు ముందు కొద్ది రోజులు ఎస్‌పీజీలోనూ విధులు నిర్వహించారు. 2015 గణతంత్ర వేడుకల సందర్భంగా ఢిల్లీలో ఆయన తొలిసారి రాష్ట్రపతి పోలీస్ మెడల్ అందుకొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయనను అవార్డుకు ఎంపిక చేసినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. తాజాగా మరోసారి ఆయన రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక కావడంతో స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, సిబ్బంది ఆయనను అభినందించారు.

మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా అందుకున్న జగదీశ్వర్


జగదీశ్వర్

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గీతం యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎల్బీనగర్‌కు చెందిన జగదీశ్వర్ కందుల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ప్రయోగాత్మక, సంఖ్యా విధానమైన కావిటేటింగ్ ఫ్లో పాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీస్' అనే అంశంపై జగదీశ్వర్ పరిశోధన చేసి థీసిస్‌ను సమర్పించినందుకుగానూ పీహెచ్‌డీ పట్టాను పొందినట్లు ఆయన తెలిపారు. ఓయూ ప్రొఫెసర్ ఉషాశ్రీ, సీబీఐటీ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డి తదితరుల సహకారంతో పీహెచ్‌డీ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. నల్గొండ జిల్లా మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన నర్సింహ, రాములమ్మ దంపతుల కుమారుడైన జగదీశ్వర్‌ది సాధారణ వ్యవసాయ కుటుంబం. సామాన్య కుటుంబం నుంచి పీహెచ్‌డీ సాధించటంపై పలువురు ఆయన్ను అభినందించారు.


తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఓటరు దినోత్సవంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మొక్కుబడిగా జాతీయ ఓటరు దినోత్సవం

హయత్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని అధికారులు, బీఎల్‌ఓలు మొక్కుడిగా నిర్వహించారు. ఓటర్లు లేకుండానే మొక్కుడిగా ప్రతిజ్ఞ చదివి చేతులు దులుపుకున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటి కార్యాలయం వద్ద కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం నిర్వహించారు. అక్కడ అధికారులు సిబ్బంది తప్ప కనీసం ఒక్క కొత్త ఓటరు కూడా లేకపోవడం గమనార్హం. తొర్రూర్ జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు పలు ప్రాంతాలలో ఓటరు దినోత్సవాలను నిర్వహించారు. అక్కడ కూడా ఓటర్లు లేరు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, యాదయ్య, బీఎల్‌ఓలు శోభారాణి, లతశ్రీ, భాగ్యలక్ష్మి, వెనిలా, వైద్యుడు శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

భారత రత్న ప్రకటించడం సంతోషకరం

కర్పూరీ ఠాకూర్ సేవా సమితి అధ్యక్షులు ఆంజనేయులు

వనస్థలిపురం, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేసిన సామాజిక న్యాయ స్ఫూర్తి ప్రదాత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారత ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం సంతోషకర విషయమని కర్పూరీ ఠాకూర్ సామాజిక సామాజిక సేవా సమితి వ్యవస్థాపకఅధ్యక్షులు అశ్విని ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వనస్థలిపురంలో అనాథ విద్యార్థులతో కలిసి కర్పూరీ ఠాకూర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ, నేటి యువత కర్పూరీ ఠాకూర్ ఆశయ సాధనకు తమ వంతుగా కృషి చేసి, సమాజశ్రేయస్సుకు కృషి చెయ్యాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రాంబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



వనస్థలిపురం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా ఎస్బీలో విధులు నిర్వహిస్తున్న 2009 బ్యాచ్‌కు చెందిన బి.రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన జలంధర్ రెడ్డి ఇటీవలే మల్టీజోన్-2కు బదిలీపై వెళ్లడంపై వనస్థలిపురం నూతన ఇన్‌స్పెక్టర్‌గా బి.రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బి.రవికుమార్ మాట్లాడుతూ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతుగా కృషి చెస్తానని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

కరసేవకుడు 'కొలన్'కు సన్మానం


బీజేపీ సీనియర్ నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డిని సత్కరిస్తున్న నరేశ్ యాదవ్, రాంరెడ్డి రఘునందన్

1990లో అయోధ్య కరసేవలో పాల్గొని జైలుకెళ్లి వచ్చిన బాలాపూర్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డిని బుధవారం రాత్రి పాత నగరంలోని అలియాబాద్‌లో సనాతన ధర్మ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నరేశ్‌యాదవ్, రాంరెడ్డి, రఘునందన్, ప్రకాశ్ ఘనంగా సన్మానించారు.

- సరూర్‌నగర్, ఆంధ్రజ్యోతి

19న ఇన్విటేషన్ రిపబ్లిక్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

విజేతలకు నగదు బహుమతులు



అమర్, అశోక్‌కు రూ.10వేల నగదు పురస్కారం అందజేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి, పక్కన అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి తదితరులు

చాదర్‌ఘాట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరుగుతున్న 19వ ఇన్విటేషన్ రిపబ్లిక్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024 గురువారం ముగిశాయి. పోటాపోటీగా జరిగిన ఫైనల్స్‌లో గెలుపొందిన విజేతలకు మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి, పక్కన అసోసియేషన్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారాలు అందజేశారు. అండర్-19లో భవధీర్, జెన్నిత్(కేపీహెచ్‌బీ), జయంత్, రాహుల్ (సన్‌సిటీ), అశోక్, శివ (దిల్‌సుఖ్‌నగర్), 35ఏళ్ల పైబడిన విభాగంలో అమర్, అశోక్ (రంగారెడ్డి), అశోక్, గణేష్ సింగ్ కద్దూస్, మనోజ్ (హైదరాబాద్), 50ఏళ్ల పైబడిన విభాగంలో భార్గవ్, సంతోష్ (దిల్‌సుఖ్‌నగర్), డాక్టర్ కృష్ణమోహన్, దివాకర్ (కొత్తపేట), అనంద్‌బాబు పోకూరి, వామన్(దిల్‌సుఖ్‌నగర్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు.

మూడు విభాగాల విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ రూ.8వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు నగదు అందజేశారు. నేషన్ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ డాక్టర్ పుల్లెల గోపీచంద్ ఫైనల్స్ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు అందజేసిన వారిలో బ్యాట్ జాయింట్ సెక్రెటరీ యు.వి.ఎన్.బాబు, కోశాధికారి వంశీధర్, కార్యవర్గసభ్యుడు పీ.సీ.ఎస్ రావు, మాజీ అధ్యక్షుడు భూపతిరాజు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కారేడ్ల శ్రీనివాస్, అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ యాదవ్, ఉపాధ్యక్షులు గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశం, కార్యదర్శి సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ అందజేత

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి ఎల్‌ఓసీని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అందజేశారు. నాగోల్ డివిజన్ సాయినగర్‌కు చెందిన లక్ష్మీ నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కుటుంబసభ్యులు సంప్రదించారు. ఆయన చొరవ చూపి.. సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి రూ.1.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. సదరు పత్రాన్ని గురువారం బాధితుడి తండ్రి కోటేశ్వరరావుకు అందజేశారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా ఉంటుందని ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పోగుల రాంబాబు పాల్గొన్నారు.

హనుమాన్ దేవస్థానం హుండీ ఆదాయం రూ.40.71లక్షలు

చంపాపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో నిత్య పూజలందుకొంటున్న ధ్యానాంజనేయస్వామితో పాటు పలు ఉప ఆలయాలలోని హుండీలను గురువారం ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ సమక్షంలో 132రోజుల హుండీలను లెక్కించగా 40లక్షల 71వేల 412రూపాయలు, 229 అమెరికా డాలర్లు, 5కెనడా డాలర్లు, 50ఆస్ట్రేలియా డాలర్ల ఆదాయం వచ్చినట్లు ఈఓ ఎం.శ్రీనివాసశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, బిల్లకంటి కిరణ్ కుమార్‌గుప్తా, శైలజ, ఆలయ సిబ్బంది, యూనియన్ బ్యాంక్ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పాతబస్తీ అభివృద్ధి : ఓవైసీ

సైదాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా పాతబస్తీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో రూ.54లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను యాఖత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సెన్, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్, కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఓవైసీ తెలిపారు. తనపై అపోహలు వద్దని, అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, కాలనీవాసులు కటికరెడ్డి రాంరెడ్డి, గిరిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పోస్టుబాక్స్ ఏర్పాటు హర్షణీయం

రిటైర్డ్ ఐపీఎస్ రమణాచారి

చంపాపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుల సేవలు ప్రశంసనీయం అని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమణాచారి అన్నారు. కర్మన్‌ఘాట్, గాయత్రీనగర్ చౌరస్తాలోని ఎల్‌పీడీఓ నిర్వాహకులు భరత్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికీ పోస్ట్ బాక్స్ ఏర్పాటు కార్యక్రమంను రమణారావు గురువారం ఆవిష్కరించారు. మీర్‌పేట ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, వైశాలీనగర్ పోస్టు ఆఫీస్ నిర్వాహకులకు పోస్టు బాక్స్‌లను భరత్ సంఘం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ రామకృష్ణ, వైశాలినగర్ పోస్టు మాస్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీపై పోలీసుల దాడి హేయమైన చర్య

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

ఎల్బీనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం నిరసన చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి, ఇతర నాయకులపై పోలీసుల దాడిని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి ఖండించారు. పోలీసుల దాడిలో గాయపడి ఓజోన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీని స్థానిక ఆర్.కె.పురం కార్పొరేటర రాధాధీరజ్‌రెడ్డితో కలిసి ఆమె గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఝాన్సీపై పోలీసులు చేసిన దాడి హేయమైన చర్య అని, ఓ మహిళ పట్ల వారి ప్రవర్తన సహేతుకంగా లేదన్నారు. యూనివర్సిటీ స్థలంలో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకించటం విద్యార్థి సంఘాలు, నాయకుల బాధ్యత అని, దాడి చేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘాన్ని కోరుతున్నట్లు శిల్పారెడ్డి పేర్కొన్నారు. ఝాన్సీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, చికిత్స ఇవ్వనున్నట్లు వైద్యులు తెలిపారని వివరించారు.

రేపు ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్ అధునాతన టెక్నాలజీపై చర్చలు

హైటెక్స్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, జనవరి25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 31వ ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్- 2024 ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ప్రకటించింది. హైదరాబాద్ వేదికగా జరిగే కన్వెన్షన్ ఈ నెల 29 వరకు జరుగుతుందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, బీఏఐ మాజీ జాతీయ అధ్యక్షుడు బొల్లినేని శీనయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కె.దేవేందర్ రెడ్డిలు తెలిపారు. హైటెక్స్‌లోని న్యాక్ క్యాంపస్‌లో బీఏఐ, ఏబీసీ నిర్వాహకులు ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, గౌరవ అతిథులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు.

మూడు రోజులపాటు 800ల మందికిపైగా ప్రతినిధులు హాజరవ్వనుండగా, ఈ సదస్సులో నిర్మాణ రంగంలో అధునాతన టెక్నాలజీ వంటి పలు అంశాలపై సెమినార్లు, టెక్నికల్ సెషన్స్ ఉంటాయని తెలిపారు. ఎగ్జిబిషన్, వర్క్‌షాప్స్, అధునాతన నిర్మాణ పరికరాలను, నిర్మాణ మెటీరియల్ వంటి విషయాలపై చర్చలుంటాయని వివరించారు. సమావేశంలో సదస్సు కార్యదర్శి సచ్చిదానంద రెడ్డి, బీఏఐ మెంబర్స్ కమిటీ చైర్మన్ డి.వి.ఎన్ రెడ్డి, హైదరాబాద్ సెంటర్ చైర్మన్ భూపేందర్ సింగ్, కన్వెన్షన్ వైస్ చైర్మన్ బల్మూరి సుగుణాకర్ రావు, కన్వెన్షన్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సంకినేని కృష్ణారావు, కోశాధికారి నరేందర్ రెడ్డి, కన్వెన్షన్ జాయింట్ సెక్రటరీ వి.సుధాకర్‌లతోపాటు మెమెంటోస్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ఫుడ్ కమిటీ వి.భాస్కర్ రెడ్డి, రిజిస్ట్రేషన్ కమిటీ జి.సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఏడీజీ వెంకటేశ్వరరావు

జీఎస్ఐలో సామ్రాట్ అశోక్ చక్రవర్తి విశేషాలపై ఫొటో ఎగ్జిబిషన్

మన్సూరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సామ్రాట్ అశోక చక్రవర్తికి సంబంధించిన జీవిత విశేషాలు, ఆయన కాలం నాటి శిలలు, స్థూపాలు, గుహల ఆధారంగా ఫొటో ఎగ్జిబిషన్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో గురువారం ఏర్పాటు చేశారు. జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సీహెచ్ వెంకటేశ్వరరావు హాజరై.. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అశోక చక్రవర్తి భారతదేశాన్ని చాలా కాలం పాలించారని, ఆయన పాలన విశేషాలు దేశ పౌరులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎల్.పి.సింగ్, ఎం.ఎల్.దొర, హెచ్.ఎం.మిశ్రా, ఆదర్ల మహేశ్, మధిర సత్యనారాయణ, ఎస్.కె.నాయక్, పి.వి.వి.ఆర్.శర్మ, అనూప్ పాల్గొన్నారు.

జిల్లెలగూడ క్రికెట్ గ్రౌండ్ వివాదం ఘటనలో..

నలుగురికి రిమాండ్

సరూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): క్రికెట్ గ్రౌండ్ లీజు విషయంలో బుధవారం మీర్‌పేట్ పీఎస్ పరిధిలోని జిల్లెలగూడ లలితానగర్‌లో గల గ్లోబల్ క్రికెట్ గ్రౌండ్ వద్ద జరిగిన ఘర్షణ సంఘటనలో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. లలితానగర్‌లోని 9600 గజాల స్థలాన్ని జిల్లెలగూడకు చెందిన కె.నర్సింహారెడ్డి, ఆయన కుమారులు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిల నుంచి చంపాపేట్ సాయిరామ్‌నగర్ కాలనీకి చెందిన ఎనుముల రాజవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పదేళ్ల కాలానికి లీజుకు తీసుకున్నారు. అందులో వారు క్రికెట్ గ్రౌండ్ నిర్వహిస్తున్నారు. లీజు గడువు మరో ఐదేళ్లు ఉండగానే గ్రౌండ్‌ను ఖాళీ చేయాల్సిందిగా యజమానులు ఒత్తిడి చేస్తున్నారు. బుధవారం బీఆర్ఎస్ మీర్‌పేట్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి తదితరులతో కలిసి భూయజమానులు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి గ్రౌండ్‌ను జేసీబీతో తవ్వేశారు. విషయం తెలుసుకున్న రాజవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తమ స్నేహితులతో కలిసి అక్కడకు చేరుకుని అదేమని ప్రశ్నించగా దుర్భాషలాడుతూ వారిపై దాడికి పాల్పడ్డారు. దీనిపై రాజవర్ధన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, కామేశ్‌రెడ్డితో పాటు జేసీబీ డ్రైవర్‌ను అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

పోలీస్ కస్టడీకి అఖిల్ పహిల్వాన్

సైదాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న అఖిల్ పహిల్వాన్‌ను గురువారం అబిడ్స్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు అఖిల్ పహిల్వాన్‌ను మూడు రోజుల కస్టడీకి తీసుకుని విచారించనున్నారు. అతడికి అంతర్జాతీయ వ్యభిచార ముఠాలతో సంబంధాలపైనా పోలీసులు ఆరా తీయనున్నట్లు సమాచారం. కోల్‌కత్తా నుంచి 16 మంది యువతులను తీసుకొచ్చి అబిడ్స్‌లోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తుండగా, ఈనెల 19న అఖిల్ పైహిల్వాన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చాదర్‌ఘాట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్మన్‌ఘాట్‌కు చెందిన సీహెచ్ అభినయ్(32), స్నేహితుడు సంతోష్ రెడ్డితో కలిసి బుధవారం అర్ధరాత్రి దిల్‌సుఖ్‌నగర్ నుంచి మలక్‌పేట వైపు యాక్టివా బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యంలో మూసారాంబాగ్ చౌరస్తాలో వెనుక బైక్ వచ్చి వేగంగా ఢీకొట్టింది, ఈ ఘటనలో అభినయ్ తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి, మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

వనస్థలిపురం, జనవరి 25(ఆంధ్ర జ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తాననీ బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గాయిత్రినగర్ బ్యాంక్ కాలనీలో భూగర్భ డ్రైనేజి పనులను కార్పొరేటర్ లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ప్రాధాన్యత క్రమంలో భాగంగా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షురాలు ఎం.సరస్వతి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షులు రవీందర్ గుప్తా, మధు, రమేష్, మనోహర్, భిక్షమయ్య, లక్ష్మీపతి, శేఖర్, అంజిరెడ్డి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి: సీఐటీయూ

ఎల్బీనగర్,జనవరి25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి కోరారు. సీఐటీయూ నేతలు గురువారం హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్‌లకు సమ్మె నోటీసులను సమర్పించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అలేటి ఎల్లయ్య మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులంత సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. సమ్మెలో భాగంగా ఈనెల 28న చైతన్యపురిలోని సీఐటీయూ ఆఫీస్‌లో ఎల్బీనగర్ నియోజకవర్గం సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నేతలు శ్రీనివాస్, మల్లెపాక వీరయ్య, చెన్నబోయిన వెంకన్నపాల్గొన్నారు.